సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.22,250
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22,250, కనిష్టంగా రూ.4 వేలు, సరాసరిన రూ.12 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.9
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
37.6°/ 15.9°
జిల్లాలో గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తగ్గుతుండగా.. క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచాయి.

న్యూస్‌రీల్

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన



ధర్మవరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సాక్షి, పుట్టపర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందంటూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. నిరుద్యోగులు, వ్యవసాయం, ఆహార సబ్సిడీ, విద్య, ఆరోగ్యం గత బడ్జెట్‌లో కన్నా ప్రాధాన్యత తగ్గించారంటూ ఆ పార్టీ నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను ప్రజలందరూ తిరస్కరించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు కల్పించాలని, ఉపాధి పథకానికి 50 శాతం నిధులు పెంచాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

అడవికి నిప్పు పెట్టిన వ్యక్తి అరెస్టు



మాట్లాడుతున్న రేంజ్ ఆఫీసర్ యామినీ సరస్వతి

పుట్టపర్తి: అడవులకు నిప్పు పెట్టి వృక్ష సంపదకు నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బుక్కపట్నం రేంజ్ ఆఫీసర్ యామినీ సరస్వతి హెచ్చరించారు. గురువారం ఆమె బుక్కపట్నం అటవీశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బుక్కపట్నం రేంజ్ పరిధిలో కొండకమర్ల సమీపంలో రిజర్వు ఫారెస్టుకు ఈ నెల 17న నిప్పు పెట్టారన్నారు. సిబ్బందితో పాటు స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశామని పేర్కొన్నారు. ఓడీచెరువు మండలం అల్లాపల్లి పరిధిలోని ఓ రైతు పొలం గట్టుకు నిప్పు పెట్టడంతో మంటలు అడవికి వ్యాపించినట్లు తేలిందన్నారు. దీంతో కమ్మవారిపల్లికి చెందిన రైతును అరెస్టు చేశామన్నారు.

చింతపండు @ 31 వేలు




మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.31 వేలు పలికింది. గురువారం మార్కెట్‌కు 962 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ-నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.31 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.15 వేల ప్రకారం ధర పలికింది. ఇక ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.11 వేలు, కనిష్టంగా రూ.4,500, సగటున రూ.6,500 ప్రకారం పలికింది. కాగా, గత వారంతో పోలిస్తే క్వింటా చింతపండు (కరిపులి రకం) రూ.7 వేలు తగ్గింది. సగటు ధర సైతం క్వింటాపై రూ.500 తగ్గుదల కనిపించింది.

ఫైనాన్స్ సంస్థ వేధింపులు
- మహిళ ఆత్మహత్యాయత్నం



హిందూపురం అర్బన్: పట్టణంలోని హస్నాబాద్‌కు చెందిన సుమయ అనే మహిళతో పాటు ఆ ప్రాంతానికి చెందిన కొందరు సంఘంగా ఏర్పడ్డారు. వారికి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ అప్పు ఇచ్చింది. సుమయ రూ.2 లక్షలు రుణం తీసుకొని ఎన్ని కంతులు కట్టినా వడ్డీకే సరిపోవడం.. అప్పు తీరకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు గురువారం రాత్రి ఆమె ఇంటి వద్దకు వచ్చి అప్పు చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఎంత చెప్పినా వినలేదు. ఇంటి దగ్గర నుంచి వెళ్లకపోవడంతో మనస్తాపానికి గురైన సుమయ ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు వెంటనే ఆమెను హిందూపురం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.



అంగన్‌వాడీ ఉద్యోగాలు

అంగన్‌వాడీ ఉద్యోగాలు అంగట్లో వస్తువులా మారాయి. ఉద్యోగం కావాలంటే డబ్బులు పెట్టి కొనాల్సిన పరిస్థితి. అడిగినంత డబ్బు ఇవ్వడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే సిఫారసు తప్పనిసరి. రెకమెండ్ లెటర్‌తో పాటు ఐసీడీఎస్ కార్యాలయంలో ముడుపులు కూడా చెల్లించాల్సిందే. డిమాండ్‌కు అనుగుణంగా రేటు ఫిక్స్ చేసి ఉద్యోగాలను అమ్మకానికి పెట్టారు.

ఖాళీలు మొత్తం	80
మెయిన్	10
మినీ	06
హెల్పర్లు	64

వచ్చిన దరఖాస్తులు	309
ఆమోదం పొందినవి	193
తిరస్కరించబడినవి	116

- డిమాండ్ ఆధారంగా రేటు ఫిక్స్
- ఎమ్మెల్యే సిఫారసు ఉంటేనే జాబ్
- 80 పోస్టులకు వచ్చిన 309 దరఖాస్తులు
- ముగిసిన ఇంటర్వ్యూలు.. ఫలితాల కోసం దరఖాస్తుదారుల నిరీక్షణ



సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో మొత్తం 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఓడీ చెరువు మినహా వివిధ ప్రాజెక్టుల పరిధిలో 80 ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. మొత్తం 309 దరఖాస్తులు రాగా.. అందులో 116 వివిధ కారణాలతో తిరస్కరించారు. మిగతా 193 మందికి ఆయా ఆర్డీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ప్రస్తుతం ఫలితాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు.

రూ.50 వేల నుంచి రూ.2 లక్షలు..

అంగన్‌వాడీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగానే.. గల్లీ లీడర్లు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి.. ఫలానా వారికి ఇద్దామని పంచాయితీ పెట్టారు. ఆ తర్వాత ఆసక్తి ఉన్న వారి దగ్గర నుంచి కొంత మొత్తం లాగడం.. ఆ తర్వాత ఐసీడీఎస్ కార్యాలయంలో మామూళ్లు ఇచ్చి.. దరఖాస్తు ఒకే చేయాలని ఆదేశించడం చకచకా జరిగిపోయాయని తెలిసింది. దరఖాస్తు ఆమోదం పొందాలంటే ఎమ్మెల్యే సిఫారసు లెటర్ తప్పనిసరి. అర్హత కేవలం ప్రామాణికం మాత్రమే.. రెకమెండేషన్ లెటర్.. అడిగినంత డబ్బు ఇచ్చినోళ్లకే ఉద్యోగం పక్కాగా వస్తుందంటున్నారు. ఒక్కో పోస్టుకు డిమాండ్‌ను బట్టి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకూ రేటు ఫిక్స్ చేసి వసూలు చేసినట్లు సమాచారం.

నామమాత్రపు ఇంటర్వ్యూలు..

ఆమోదం పొందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అడిగిన ప్రశ్నలన్నీ.. చాలా సులువుగా ఉన్నాయని చెబుతున్నారు. తమకు నచ్చిన వారికి కఠినమైన ప్రశ్నలు అడగకుండా.. ఈజీ ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. జాబితా ముందుగా సిద్ధమైనప్పటికీ.. కేవలం డబ్బు ఇచ్చారనే కారణంగా.. వారికే ఉద్యోగం ఇవ్వాలనే ఉద్దేశంతో అధికారులను ప్రజాప్రతినిధులు కొనేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

అర్హులకే ఉద్యోగాలు

అంగన్‌వాడీ ఖాళీ పోస్టులకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి.. సరిగా ఉన్న వాటిని మాత్రమే ఆమోదించాం. ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన వారికి ఆయా ఆర్డీఓ కార్యాలయాల్లో ఈనెల 14వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తుది జాబితాను కలెక్టర్ కార్యాలయానికి పంపించాం. నిబంధనలకు అనుగుణంగా అర్హత, ఇంటర్వ్యూలో ప్రతిభ చూపిన వారికే ఉద్యోగాలు వస్తాయి.
– సుధా వరలక్ష్మి, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ

ఖాళీల వివరాలు (ప్రాజెక్టుల వారీగా)	
ధర్మవరం	2 అంగన్‌వాడీ వర్కర్లు
చెన్నేకొత్తపల్లి	3 అంగన్‌వాడీ వర్కర్లు
చెన్నేకొత్తపల్లి	మినీ అంగన్‌వాడీ వర్కర్
చెన్నేకొత్తపల్లి	13 అంగన్‌వాడీ హెల్పర్లు
ధర్మవరం	6 అంగన్‌వాడీ హెల్పర్లు
బత్తలపల్లి	5 అంగన్‌వాడీ హెల్పర్లు
హిందూపురం	అంగన్‌వాడీ వర్కర్
పెనుకొండ	అంగన్‌వాడీ వర్కర్
మడకశిర	అంగన్‌వాడీ వర్కర్
మడకశిర	మినీ అంగన్‌వాడీ వర్కర్
పెనుకొండ	మినీ అంగన్‌వాడీ వర్కర్
హిందూపురం	12 అంగన్‌వాడీ హెల్పర్లు
సోమందేపల్లి	అంగన్‌వాడీ హెల్పర్
గుడిబండ	4 అంగన్‌వాడీ హెల్పర్లు
మడకశిర	2 అంగన్‌వాడీ హెల్పర్లు
పెనుకొండ	4 అంగన్‌వాడీ హెల్పర్లు
నల్లచెరువు	2 అంగన్‌వాడీ వర్కర్లు
నల్లచెరువు	మినీ అంగన్‌వాడీ వర్కర్
కదిరి	మినీ అంగన్‌వాడీ వర్కర్
నల్లచెరువు	2 అంగన్‌వాడీ హెల్పర్లు
కదిరి	5 అంగన్‌వాడీ హెల్పర్లు
పుట్టపర్తి	మినీ అంగన్‌వాడీ హెల్పర్లు
పుట్టపర్తి	7 అంగన్‌వాడీ హెల్పర్లు
సోమందేపల్లి	2 అంగన్‌వాడీ హెల్పర్లు

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి




సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, కలెక్టర్, జేసీ

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన రీసర్వేను గురువారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో పరిశీలించారు. ఆయనతో పాటు కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఉన్నారు. గ్రామానికి చెందిన రైతు చిన్నపరెడ్డి పొలంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించి రీసర్వే అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పూర్తయితే మళ్లీ ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, ఏడీ విజయశాంతిబాయి, డీటీ కళ్యాణ్, సర్వేయర్ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకర్లు విరివిగా రుణాలు అందివ్వాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: బ్యాంకర్లు జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులు, రైతులకు విరివిగా రుణాలు అందివ్వాలని కలెక్టర్ టీఎస్ చేతన్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం స్థానిక మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్య సాధన ప్రగతిపై బ్యాంకర్లు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో స్థిరమైన వృద్ధిరేటు సాధనకు కృషి చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసిన లబ్ధిదారులు జిల్లాలో 2 వేల మంది ఉన్నారని, వారికి రుణాలు అందించేందుకు జాబితా సిద్ధం చేసి లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు ఇవ్వాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి మంజూరైన యూనిట్లకు సంబంధించి రుణాలను గడువులోగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధి గంగాధర్, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పట్టు పరిశ్రమశాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఎల్‌డీఎం రమణకుమార్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, నాబార్డ్ మేనేజర్ అనురాధ పాల్గొన్నారు.





మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా కనిపిస్తున్న అగళి ప్రధాన రహదారి

వారం రోజుల్లో జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు		
తేదీ	పగలు	రాత్రి వేళ
16.2.25	21	31
18.2.25	22	32
19.2.25	20	34.1
20.2.25	24	34

హిందూపురం అర్బన్/ అగళి: ఫిబ్రవరి కూడా దాటకనే ఈసారి ఎండలు దంచి కొడుతున్నాయి. రోజురోజుకూ ఎండతీవ్రత పెరుగుతోంది. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు.

34 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు..

జిల్లాలో గత నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు క్రమ క్రమంగా 34 డిగ్రీలకు చేరాయి. రాత్రి పూట ఉక్కపోత కూడా మొదలైంది. పల్లెల్లో ఉక్కపోత తట్టుకోలేక ఇళ్లపై పడుకుంటున్నారు. మార్చిలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా చేరే అవకాశం ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఇంత ఎండలేదని ఈసారి అప్పుడే భానుడు ఉగ్ర రూపం చూపుతున్నాడని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణశాఖ అధికారులు సైతం రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరగనున్నట్లు హెచ్చరిస్తున్నారు.

తగ్గిన చలి తీవ్రత..

జనవరిలో చలి తీవ్రంగా ఉన్నప్పటికీ 20 రోజులు తిరక్కుండానే వాతావరణంలో ఎంతో మార్పు కనిపిస్తోంది. చలి తీవ్రత తగ్గింది. మంచు కురవడం కూడా తగ్గడం.. ఎండలు మండుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉదయం .. సాయంత్రం మినహా బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు.

ఎండలు ఎక్కువయ్యాయి



వేసవికాలం ప్రారంభంలోనే ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఉదయం 10 గంటలకే ఎండ దంచికొడుతోంది. సాయంత్రం 5 గంటల వరకూ బయటకు రాలేక పోతున్నాం. ఇంట్లో కూడా ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం.
– మంజునాథ, ఆలూడి, అగళి మండలం

జాగ్రత్తలు తీసుకోవాలి



ఎండలు మండుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలు విపరీతంగా పెరగడంతో చెమట ద్వారా సోడియం, పొటాషియం లవణాలు ఎక్కువ వెళ్లిపోతాయి. దీంతో వడదెబ్బ తగిలే అవకాశాలున్నాయి. మజ్జిగ ఎక్కువగా తీసుకోవడం మంచిది. మామూలు నీటితో పాటు కొబ్బరి బోండం తాగటం మంచిది. పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి.
– సతీష్‌రెడ్డి, వైద్యులు, మడకశిర

జగన్‌పై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి



సీఐ నాగేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు, కౌన్సిలర్లు



కదిరిలో సీఐకి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్ గజ్జల శివ, ఎస్సీ, ఎస్టీ విభాగం నేత చౌడప్ప, చాంద్‌బాషా కోరారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌కు వారు ఫిర్యాదు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా కొందరు అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారన్నారు. ఐటీడీపీ కార్యకర్తలు జగన్ ప్రతిష్టని దెబ్బ తీయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్న వారిపై కేసు నమోదు చేయాలని కోరారు.

కదిరి టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు కోరారు. ఈమేరకు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డికి న్యాయవాది వెంకటరమణారెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌పై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, లీగల్ సెల్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రెడ్డి, నాయకులు నరేష్‌రెడ్డి, కృష్ణానాయక్, మణికంఠ నాయక్ తదితరులు ఉన్నారు.

ఓ సాయి.. నీమాటే మాబాట



ప్రత్యేక అలంకరణలో సాయీశ్వర లింగం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న నవీన్, ప్రతీక్ బృందం



అతిరుద్ర మహాయజ్ఞ క్రతువును నిర్వహిస్తున్న పండితులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో అతిరుద్ర మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఏడోరోజు గురువారం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత అతి రుద్ర మహాయజ్ఞ క్రతువులను కొనసాగించారు. సాయంత్రం ప్రముఖ ఫ్లూట్ వాయిద్యకారుడు నవీన్, సరోద్ విద్వాంసుడు ప్రతీక్ బృందం సంగీత కచేరీ అలరించింది. అంతకుముందు చెన్నైకి చెందిన సంస్కృత ప్రెసిడెన్సీ కళాశాలకు చెందిన హెచ్‌ఓడీ తియాగరాజన్ అతిరుద్ర మహాయజ్ఞం విశిష్టతను వివరించారు.

సర్వే..శఠగోపం!



- ఉమ్మడి జిల్లాలో ఇంటింటి సర్వేకి చంద్రబాబు సర్కారు శ్రీకారం
- ఫ్రిజ్‌లు, ఏసీలు ఉంటే పక్కాగా నమోదు చేయాలని ఆదేశాలు
- కరెంటు బిల్లులు, సొంతిళ్లు, కారు వివరాలు కూడా సేకరణ
- ఈ సారి రేషన్‌కార్డులు, పెన్షన్లలో భారీగా కోత!
- ఇప్పటికే వైకల్య సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో పింఛన్ల కట్

జిల్లాలో పింఛన్ల వివరాలు	
వృద్ధాప్య	1,48,252
వితంతు	54,148
వికలాంగుల	35,997
చేనేత	12,776
ఒంటరి మహిళ	6,485
డప్పు కార్మికులు	4,434
అభయహస్తం	4,555
చర్మ కార్మికులు	2,326
మెడికల్ పింఛన్లు	2,257
కిడ్నీ వ్యాధిగ్రస్తులు	357

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల వేళ ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ఇప్పుడు తన నిజ స్వరూపాన్ని బయటపెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 'సంపద సృష్టిస్తా.. ఆ సంపదను పేదలకు పంచుతా.. రైతులు పొలంలోనే కరెంటు ఉత్పత్తి చేసి, ఆ తర్వాత వాడుకోగా మిగిలింది గవర్నమెంటుకు సప్లై చేసే విధంగా చేస్తా' అంటూ అప్పట్లో లేనిపోని గొప్పలు చెప్పిన బాబు.. ఇప్పుడు పెన్షన్లు, రేషన్ తదితర ప్రభుత్వ పథకాలకు కోత వేసేలా పావులు కదుపుతుండటంపై అన్ని వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

భారీగా ఆంక్షలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టేలా చంద్రబాబు ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇంటింటి సర్వేలో ప్రభుత్వ పథకాల అర్హతకు భారీగానే ఆంక్షలు విధించనున్నారు. కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందంటే వెంటనే ఆ ఇంట్లో వారికి వచ్చే పెన్షన్, రేషన్ కట్‌చేసేలా సర్వే నిర్వహిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఇంటికీ రిఫ్రిజిరేటర్ (ఫ్రిజ్) ఉంది. ఇప్పుడు ఇది కూడా ఆంక్షల జాబితాలోకి వచ్చింది. కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చి, ఫ్రిజ్ ఉందంటే కఠిన నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇక కారు, సొంతిళ్లు, భూములు, స్థలాలు కూడా ఆంక్షల జాబితాలో చేరుతున్నాయి. పైన నిర్ణయించిన వాటిలో ఏవైనా ప్రభుత్వ పథకానికి అడ్డంకిగా మారే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ఏవి ఉన్నా హోల్డ్..!

గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శులతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి ముందుగా అర్బన్ ఏరియాల్లో కార్యదర్శులకు ఈనెల 19న శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఇళ్లన్నీ జియోట్యాగింగ్‌లో ఉన్నాయి. ఆయా ఇళ్లకు వెళ్లి గత నెల వచ్చిన కరెంటు బిల్లుతో పాటు ఫ్రిజ్ ఉందా, ఏసీ ఉందా వంటివన్నీ పరిశీలించి నమోదు చేస్తారు. ముందుగా మున్సిపాలిటీల పరిధిలో పూర్తయ్యాక, తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తారని, ఆయా వస్తువుల్లో ఏవి ఉన్నాయని తేలినా పథకాలు హోల్డ్‌లో పెడతారని చెబుతున్నారు.

వైకల్య బాధితులనూ వదల్లేదు..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వైకల్య బాధితులను కూటమి సర్కారు ముప్పు తిప్పలు పెడుతోంది. ఇప్పటికే జిల్లాలో వేలాది పెన్షన్లకు కత్తెర వేసిన విషయం తెలిసిందే. గడిచిన పదేళ్లుగా వైకల్య పెన్షన్ తీసుకుంటున్న వారికి మళ్లీ ఇప్పుడు కొత్తగా పరీక్షలు చేస్తామని చెప్పింది. దీంతో శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలో ఉన్న 36 వేల మంది లబ్ధిదారులు అనంతపురం రావాల్సి వస్తోంది. డాక్టర్లు ఇక్కడే ఉండటంతో 130 కిలోమీటర్ల నుంచి కూడా అవస్థలు పడుతూ వస్తున్నారు. తాజాగా సదరం వెరిఫికేషన్‌లో సుమారు 30 శాతం పింఛన్లకు కోత వేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

మామిడి తోటకు నిప్పు



కాలిపోయిన మామిడి చెట్లు

మడకశిర రూరల్: మండలంలోని సి.రంగాపురం గ్రామ సమీపంలో రైతు చెన్నరాయప్ప సాగు చేసిన మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం నిప్పంటించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పే లోపు మామిడి తోటతో పాటు పక్కనే ఉన్న మొక్కజొన్న పంట కాలిపోయింది. తీవ్రంగా నష్టపోయిన తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి : డీఈఓ



కనగానపల్లి ఏపీఎంఎస్ బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీఈఓ కిష్టయ్య

కనగానపల్లి: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యంపై దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు డీఈఓ కిష్టయ్య సూచించారు. కనగానపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌ను గురువారం ధర్మవరం ఆర్డీఓ మహేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఈఓ ఉన్నారు. కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాల, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ గదులు, వంటశాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని డీఈఓ ఆదేశించారు. విద్యార్థులకు ప్యూరిఫైడ్ నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

గుంతకల్లు: మండలంలోని వెంకటాంపల్లిలో వెలసిన పెద్ద కదిరప్పస్వామి రథోత్సవంలో భాగంగా గురువారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. దాదాపు 9 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన రైతు ఇంద్రారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి.

నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.10 లక్షల విరాళం



చెక్కును ఈఓకు అందజేస్తున్న బెంగళూరు వాసులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి కర్ణాటక రాజధాని బెంగళూరులోని మార్తనహళ్లికి చెందిన ఎం.రమేష్ రెడ్డి, చంద్రిక కుటుంబసభ్యులు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డికి గురువారం వారు అందజేశారు. ఈ సందర్భంగా దాతల పేరుతో ఆలయంలో విశేష పూజలు నిర్వహించి స్వామి శేషవస్త్రాం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

హక్కుల ఉద్యమ నేత నరేంద్రసింగ్ బేడీ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

పెనుకొండ: కార్మిక, కర్షక, కూలీ, రైతాంగ హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు సాగించిన మహోన్నత వ్యక్తి నరేంద్రసింగ్ బేడీ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక షాదీమహల్‌లో గురువారం నరేంద్రసింగ్ బేడీ సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ... యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా దశాబ్దాలుగా నరేంద్రసింగ్ బేడీ సాగించిన ప్రజా ఉద్యమాలను గుర్తు చేశారు. అనేక ప్రాంతాల్లో కార్యాలయాలు నెలకొల్పి సిబ్బందిని నియమించి ప్రజా చైతన్యం కోసం అహర్నిశలు ఆరాటపడ్డారన్నారు. ఆయన పోరాటల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. పేదల అభ్యున్నతి కోసం పరితపించిన బేడీ ఎప్పటికీ ప్రజల గుండెల్లో జీవించే ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉద్యోగులు వెంకటేశ్వర్లు, రామాంజినేయులు, నరసింహమూర్తి, రాయప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

పుట్టపర్తి అర్బన్: స్థానిక ప్రశాంతి నిలయం – బసంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. లోకో పైలెట్ సమాచారంతో రైల్వే పోలీసులు గురువారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. తెల్లని చొక్కా, తెల్లని బనియన్, పంచె ధరించాడు. రైలు దూసుకెళ్లడంతో మృతదేహం ఛిద్రమైంది. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94907 98793లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

యువకుడి ఆత్మహత్య

లేపాక్షి: పెళ్లి కాలేదన్న దిగాలుతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం కుర్లపల్లికి చెందిన రామాంజినేయులు (26)కు కుటుంబసభ్యులు పెళ్లి ప్రయత్నాలు చేపట్టారు. అయితే ఏ సంబంధమూ కుదరలేదు. దీంతో తనకు పెళ్లి చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ తరచూ తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఇక తనకు పెళ్లి కాదేమోనని దిగాలుతో గురువారం ఉదయం లేపాక్షి చెరువు కట్టపై ఉన్న చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వెలుగు సీసీలపై కేసు నమోదు

గోరంట్ల: వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు సీసీలతో పాటు మండల సమాఖ్య అధ్యక్షురాలిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. గోరంట్లలోని నాల్గో వార్డులోని అల్లామాలిక్ మహిళ సంఘం వీఓఏగా పనిచేస్తున్న చాకలి వరలక్ష్మిని గతేడాది నవంబర్‌లో విధుల నుంచి తొలగించారు. ఆమెకు ఆరు నెలల వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని చెల్లించకుండా అధికారులు ఇబ్బంది పెట్టడమే కాకుండా తన చీర లాగి దుర్భాషలాడారంటూ వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెలుగు సీసీ సుధాకర్, చంద్రశేఖర్‌తో పాటు మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమణిపై కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడిని కులంపేరుతో దూషణ

- టీడీపీ నేతపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కదిరి అర్బన్: అప్పు ఇవ్వని ఉపాధ్యాయుడిని కులం పేరుతో దూషించిన టీడీపీ నేతపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని కే. బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ స్కూల్‌లో ఓబులేసు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆ పాఠశాల పేరెంట్ కమిటీ చైర్‌పర్సన్ భర్త, టీడీపీ నాయకుడు మనోహర్‌నాయుడు తరచూ పాఠశాలకు వెళ్లి అధికారం చెలాయించేవాడు. ఈ క్రమంలోనే తనకు రూ.50 వేలు అప్పుగా ఇవ్వాలంటూ కొన్నిరోజులుగా ఓబులేసును వేధిస్తున్నాడు. తన వద్ద అంత డబ్బులేదని చెప్పినా వినిపించుకునే వాడు కాదు. ఈక్రమంలోనే గురువారం ఓబులేసు పాఠశాలకు వెళ్తుండగా రోడ్డుపైనే అడ్డగించిన మనోహర్‌నాయుడు డబ్బుల కోసం బెదిరించాడు. తనకు డబ్బులు ఇవ్వకపోతే ఇవ్వకపోతే ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానంటూ బెదిరించడంతో పాటు కులం పేరుతో దూషించాడు. దీంతో భయపడిపోయిన ఉపాధ్యాయుడు ఓబులేసు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మనోహర్‌నాయుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్‌గా ఆసీఫ్-ఉల్లా



ఆసీఫ్-ఉల్లా, నాగేంద్రబాబును అభినందిస్తున్న టీఎన్ దీపిక (చిత్రంలో) మున్సిపల్ కౌన్సిలర్లు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్‌గా 30వ వార్డు కౌన్సిలర్ ఎస్.ఎం.ఆసీఫ్-ఉల్లాను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కౌన్సిలర్ల సమావేశంలో పలు అంశాలపై దీపిక చర్చించారు. అనంతరం ఫ్లోర్ లీడర్‌గా ఆసీఫ్-ఉల్లా, డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా 24వ వార్డు కౌన్సిలర్ నాగేంద్రబాబును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దొడ్డి దారిన హిందూపురం మున్సిపాలిటీని దక్కించుకున్న టీడీపీకి కౌన్సిల్ సమావేశాల్లో తగిన గుణపాఠం చెపుతామన్నారు. మున్సిపాలిటీలో అక్రమాలు చేయడానికే వారు దుశ్చర్య పాల్పడ్డారని, వారి ఆటలో సాగనివ్వబోమని అన్నారు. ఆసీఫ్-ఉల్లా మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం మేరకు, సమన్వయకర్త దీపిక ఆదేశానుసారం కౌన్సిల్‌లో ప్రజల తరఫున నిలిచి పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ కోసమే 'ఆధ్య'

- ఎస్పీ రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

రామగిరి: బాలికల శక్తిని తెలియజేస్తూ సమాజంలో చోటు చేసుకుంటున్న విపరీతాలపై అవగాహన కల్పించేలా ఆధ్య కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్పీ రత్న తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా రామగిరి మండలంలోని నసనకోట సమీపంలో ఉన్న ఏపీఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఆధ్య కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలసి ఆమె ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఎస్పీ హేమంత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు తొందరగా అన్నింటికీ ఆకర్షితులవుతుంటారన్నారు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకోలేని స్థితిలో పెడదారి పట్టి ఉజ్వల భవితను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాకు బానిసలుగా మారితే జీవితాలు నాశనమవుతాయన్నారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఒక బాలిక తప్పు చేస్తే అది ఎంతో మందిపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులకు దివ్యాంగురాలి అప్పగింత



ధనమ్మను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

బత్తలపల్లి: బస్సులో ప్రయాణిస్తూ గమ్యస్థానంలో దిగకుండా తప్పిపోయిన దివ్యాంగురాలి (మూగ) ఆచూకీని పసిగట్టి సురక్షితంగా కుటుంబసభ్యుల చెంతకు పోలీసులు చేర్చారు. వివరాలు.. తాడిమర్రి మండలం ఏకపాదంపల్లికి చెందిన ధనమ్మ పుట్టుకతోనే మూగతో బాధపడుతోంది. ఇటీవల సింగారం కొత్తపల్లిలో ఉన్న తన సోదరి ఆదెమ్మ ఇంటికి వెళ్లిన ఆమెను బుధవారం ఏకపాదంపల్లికి వెళ్లే బస్సును ఆదెమ్మ ఎక్కించింది. ధనమ్మ రాక కోసం మరో సోదరి రామలక్ష్మి మాల్యవంతం వద్ద ఎదురు చూస్తుండగా రాత్రి ఏడు గంటలవుతున్నా ఆమె రాకపోవడంతో తప్పిపోయిందని గ్రహించిన కుటుంబ సభ్యులు వెంటనే బత్తలపల్లి పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆదేశాలతో బత్తలపల్లి ఏఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు ఉమ్మడి జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు వాట్సాప్ గ్రూపులలో తప్పిపోయిన ధనమ్మ వివరాలను పోస్టు చేశారు. రాత్రి 12 గంటల సమయంలో కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలో దిక్కుతోచని స్థితిలో తచ్చాడుతున్న ధనమ్మను గుర్తించిన అక్కడి పోలీసులు వెంటనే స్టేషన్‌కు పిలుచుకెళ్లి ఆశ్రయం కల్పించారు. సమాచారం చేరవేయడంతో రాత్రికి రాత్రే బత్తలపల్లి పోలీసులు, ధనమ్మ కుటుంబసభ్యుడు ఎర్రిస్వామి అక్కడకు వెళ్లి ఆమెను పిలుచుకునివచ్చారు. గురువారం తహసీల్దార్ స్వర్ణలత సమక్షంలో ధనమ్మను కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఫారెస్ట్ అధికారిపై అవినీతి ఆరోపణలు

మడకశిర: స్థానిక రేంజ్ ఫారెస్ట్ అధికారి కుళ్లాయప్ప అవినీతిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. గురువారం ఉదయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన అంశాలు నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. కట్టెల వ్యాపారులు, రైతులు తదితరుల నుంచి పెద్ద ఎత్తున డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా సోషల్ మీడియాలో పలువురు పోస్టులు పెట్టారు.ఈ అక్రమాలకు పెనుకొండ రేంజ్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి ఊతమిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. కాగా, కుళ్లాయప్ప అవినీతిపై ఇటీవల కొందరు అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు లేకపోవడంతో చివరకు సోషల్ మీడియా ద్వారా ఆయన అక్రమాలు బహిర్గతం చేసినట్లుగా తెలుస్తోంది.

ఎడ్ల బండి బోల్తా - పలువురికి గాయాలు

అమరాపురం: ఎడ్ల బండి బోల్తాపడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు... అమరాపురం మండలం పి.శివరం గ్రామానికి చెందిన మారెక్క, లక్ష్మమ్మ, రామాంజప్ప గురువారం ఉదయం ఎడ్ల బండిపై వడ్ల బస్తాలు వేసుకుని కె.శివరం గ్రామంలో ఉన్న మిషన్ వద్దకు బయలుదేరారు. మార్గమధ్యంలో కాడెద్దులు బండిని ఓ పక్కకు లాక్కొని వెళ్లడంతో బోల్తాపడింది. బండిపై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. మారెక్కకు ఎడమ చెయ్యి విరిగింది. నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మమ్మ, రామాంజప్పకు మూగ దెబ్బలు తగిలాయి. అటుగా వెళుతున్న వారు ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రులను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మారెక్కను మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లారు.

ప్రమాదంలో మున్సిపల్ కార్మికుడి మృతి

పావగడ: స్థానిక శని మహాత్మ సర్కిల్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో మున్సిపల్ కార్మికుడు మంజునాథ్ (40) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గురువారం ఉదయం 11 గంటల సమయంలో సర్కిల్ వద్ద రోడ్డు పక్కన చెత్తను శుభ్రం చేస్తుండగా ఎస్ఎస్‌కే సర్కిల్ నుంచి ఆర్‌జే సర్కిల్ వైపు వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ట్రాక్టర్ టైర్ తగలడంతో మంజునాథ్ తలకు బలమైన రక్తగాయమైంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పారిపోయాడు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరు జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడి కుమార్తె నందిని ఫిర్యాదు మేరకు సీఐ సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మంజునాథ్ మృతి విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్, ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, కౌన్సిలర్లు, పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర సంతాపం ప్రకటించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



మంజుల

రొళ్ల: తన భార్య మంజుల కనిపించడం లేదంటూ గురువారం సాయంత్రం పోలీసులకు భర్త శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు... రొళ్ల మండలం కేపీ తండా గ్రామానికి చెందిన చిన్నవెంకటప్ప కుమారుడు శ్రీనివాసులుకు 13 ఏళ్ల క్రితం బెంగళూరుకు చెందిన మంజులతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 15న సాయంత్రం 6 గంటలకు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా మంజుల వెళ్లిపోయింది. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ ఆమె కోసం కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 99724 84670 సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

మంత్రి ప్రోద్బలం.. రెవెన్యూ దౌర్జన్యం





భూ యజమానులను పక్కకు నెట్టేస్తున్న పోలీసులు, విలేకరులతో మాట్లాడుతున్న భూ బాధితులు

- వైఎస్సార్‌సీపీ నేత భూమి స్వాధీనం
- ఇప్పటికే కోర్టులో నడుస్తున్న వాజ్యం
- అయినా పట్టుబట్టి స్వాధీనం చేసుకున్న అధికారులు

పెనుకొండ రూరల్: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి పెనుకొండలో మంత్రి సవిత దౌర్జన్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అధికారులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపులకు దిగుతున్నారు. గురువారం వైఎస్సార్ సీపీకి చెందిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి భూమిని రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా సాధీనం చేసుకున్నారు. ఈ స్థలంపై కోర్టులో వాజ్యం నడుస్తున్నప్పటికీ మంత్రి ప్రోద్బలంతో భారీగా పోలీస్ బందోబస్తుతో అధికారులు అక్కడకు చేరుకుని జేసీబీ ద్వారా మామిడి మొక్కలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు.

ఏం జరిగిందంటే...

శెట్టిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 28-2 లెటర్‌లో 28 సెంట్ల భూమి కృష్ణారెడ్డికి వారసత్వంగా సంక్రమించింది. కరణం వెంకోబరావు నుంచి ఈ భూమిని కృష్ణారెడ్డి తాత కొనుగోలు చేశారు. ఆ తర్వాత కృష్ణారెడ్డి తండ్రి సుబ్బిరెడ్డి పేరుతో పాసు పుస్తకాన్ని రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. అనంతరం ఆ భూమిని కృష్ణారెడ్డి తన భార్య అర్చన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందుకు సంబంధించిన ఈసీ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కృష్ణారెడ్డిపై టీడీపీ నేతలు కక్ష సాధింపులకు దిగారు. ఈ క్రమంలోనే మంత్రి సవిత ప్రోద్బలంతో సంబంధం లేని వ్యక్తులను కరణం వెంకోబరావు వారసులుగా చిత్రీకరించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో కృష్ణారెడ్డి కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు కోర్టులో పరిధిలో ఉంది. ఈ క్రమంలోనే గురువారం తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి తదితరులు కృష్ణారెడ్డికి చెందిన స్థలం వద్దకు వచ్చి ఆ స్థలంలో ఉన్న మామిడి చెట్లను జేసీబీతో తొలగించారు. అనంతరం పంచనామా నిర్వహించి వెంకోబరావు వారసులుగా చెబుతున్న వారికి స్థలాన్ని స్వాధీనం చేశారు.

దౌర్జన్యంగా లాక్కున్నారు

శెట్టిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 28-2 లెటర్‌లో 28 సెంట్ల స్థలం మా తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తోంది. ఇటీవల ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్ఓ తేజ నా వద్దకు వచ్చి నాలుగు సెంట్ల స్థలం అంగన్‌వాడీ కేంద్రం కోసం ఇవ్వాలని కోరగా నేను సమ్మతించాను. అయినా రాజకీయ కక్షతో నా భూమిని అక్రమంగా లాక్కొన్నారు. నా దగ్గర రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పాసు పుస్తకం ఉన్నాయి. ప్రస్తుతం నేను భూమిలో ఉన్నాను.

– కృష్ణారెడ్డి, బాధితుడు